
సాక్షి
మహబూబ్‌నగర్

శనివారం, 24, మే, 2025



హైవే.. వివాదం
జడ్చర్లలో చేపట్టిన ఎన్‌హెచ్‌-167 నిర్మాణం వివాదాలకు కేంద్రబిందువుగా మారింది.

వివరాలు 10లో ▸



పత్తి విత్తనాల పట్టివేత
ప్రభుత్వం నిషేధించిన బీజీ-3 పత్తి విత్తనాలను అధికారులు పట్టుకున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.5 /22.5

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

210 మందికి జరిమానా
మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా **కేంద్రం**లో వివిధ చోట్ల నిషేధిత ప్లాస్టిక్ **వస్తువులు** అమ్ముతున్న దుకాణదారులపై **శుక్రవారం** మున్సిపల్ అధికారులు దాడులు ని**ర్వహిం**చారు. కాగా, 120 మైక్రాన్స్ కంటే **తక్కువ** మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు తదితర వస్తువులను కొనడం, అమ్మడాన్ని ప్రభుత్వం నిషేధించిందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాజాగా తనిఖీలు జరిపారు. నగరంలోని మార్కెట్ ఏరియా, న్యూటౌన్, బస్టాండ్, షాషాబ్‌గుట్ట, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో 210 చిరువ్యాపారులకు రూ.13 వేల జరిమానా విధించారు. అలాగే మొత్తం 168 కిలోల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకునే వరకు పోరాటం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముస్లింలకు వ్యతిరేకంగా బీజేపీ సర్కారు తెచ్చిన వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకునేవరకు బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ హెచ్చరించారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలకు చెందిన వక్ఫ్ ఆస్తులను గుంజుకునేందుకు బీజేపీ ఈ బిల్లును తెచ్చిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ముస్లింలకు ఈ బిల్లు వ్యతిరేకమని, అందుకు మద్దతు తెలిపిన టీడీపీకి ఏపీలో ముస్లిం ఓట్లు పడవన్నారు. వేలాది కోట్ల వక్ఫ్ ఆస్తులపై కన్ను వేసిన బీజేపీ సర్కారు వారికి కొల్లగొట్టేందుకు ఈ బిల్లును తెచ్చిందని అందుకు సహకరించిన టీడీపీ, జేడీఎస్‌లకు భవిష్యత్‌లో బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు. వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో ఈనెల 25న స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్‌తో పాటు ఇతర మత పెద్దలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మైనార్టీ అధ్యక్షుడు మోసిన్, అబ్దుల్ సుల్తాన్, అహ్మద్‌సన, ఇమ్రాన్, ఇద్రీస్, మేరాజ్, హనీజ్, షారుక్, సిద్ధిక్, ఇబ్రహీం, నూర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,281
జడ్చర్ల/నవాబుపేట: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2281, కనిష్టంగా రూ.1,501 ధరలు లభించాయి. ఆముదాలు రూ.6,066, చింతగింజలు రూ.3,457, హంస రకం ధాన్యం గరిష్టంగా రూ.1,701, కనిష్టంగా రూ.1,629, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,159, కనిష్టంగా రూ.1,609, వేరుశనగ గరిష్టంగా రూ.5,326, కనిష్టంగా రూ.4,431 ధరలు లభించాయి. నవాబ్‌పేట మార్కెట్‌కు శుక్రవారం 11వేల బస్తాల ధాన్యం వచ్చింది. సీడ్ (1010) ధాన్యం రూ.1967 ధర పలకగా.. ఆర్‌ఎన్‌ఆర్ గరిష్టంగా రూ.2,296, కనిష్టంగా రూ.1944 ధర లభించింది.

మళ్లీ వరికే మొగ్గు




వానాకాలం పంట ప్రణాళిక ఖరారు
- జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో పంటలు
- గతేడాది కంటే 15,332 ఎకరాలు ఎక్కువ
- వరి, పత్తి పంటలకే పెద్దపీట
- క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీలు
- 33,286 టన్నుల ఎరువులు సిద్ధం

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): వానాకాలం వచ్చేస్తోంది. రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సైతం వానాకాలం పంట సాగు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,46,830 ఎకరాలలో పంటలు సాగు చేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 15,332 ఎకరాలలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తేల్చారు. కాగా.. గతేడాది వానాకాలంలో అత్యధికంగా వరి పంటను 1,94,982 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించగా, ఈ ఏడాది 2,00,000 ఎకరాలకు పెంచారు. సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుండటంతో గత వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు అంచనాలకు మించి వరి పంట వేశారు. దీంతో ఈ ఏడాది వ్యవసాయ ప్రణాళికలో వరి సాగు లక్ష్యం పెంచారు. వరి తర్వాత అత్యధికంగా 85 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉంది.

46,700 మెట్రిక్ టన్నులు అవసరం
జిల్లాలో వానాకాలం సీజన్‌లో 46,700 మెట్రిక్ టన్నుల వివిధ ఎరువులు అవసరం అవుతాయని అంచనా. అయితే ఇప్పటికే 33,286.64 టన్నులు సిద్ధంగా ఉంచారు. దశల వారీగా అన్ని మండలాల్లో పీఏసీఎస్, డీలర్ల వద్దకు చేరుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువ అందుబాటులో ఉన్నాయి. రైతులు ఎక్కువగా వినియోగించే డీఏపీ నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అయితే సీజన్ ఆరంభం నాటికి డీఏపీ నిల్వలు సరిపడనంతగా అందుబాటులో ఉంచుతామని అధికారులు చెబుతున్నారు. డీఏపీ స్థానంలో కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవచ్చని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

రసాయన ఎరువుల నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో)



జిల్లాలో అధికారుల సాగు అంచనా ఇలా..

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)	అవసరమయ్యే విత్తనం (క్వింటాళ్లలో..)
వరి	2,00,000	8,000
పత్తి	85,000	1,19,000 (పత్తి పాకెట్లలో (450 గ్రా.)
మొక్కజొన్న	30,000	2,500
కందులు	10,000	550
జొన్న	18,000	350
ఇతర పంటలు	3,830	1,500

లెక్కలు తీస్తున్న వ్యవసాయ అధికారులు

ఈ ఏడాది ముందే రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేయడంతో ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తోంది. గతంలో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొరత ఎదురవడంతో ఈ ఏడాది ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్నారు. సొసైటీలు, డీలర్ల వద్ద డీఏపీ, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల లభ్యతపై ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు, వానాకాలం పంటలకు అవసరమయ్యే ఎరువులపై లెక్కలు తీస్తున్నారు. జిల్లా, డివిజన్, మండలస్థాయి వ్యవసాయ అధికారులు రోజువారీ పర్యటించి తమ పరిధిలో ఉన్న డీలర్ల దగ్గర ఎరువుల నిల్వలను తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు. వాస్తవానికి వానాకాలం సీజన్ ఆరంభానికి ముందే 50 శాతం విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతారు. అందులోభాగంగా ప్రైవేట్ డీలర్లతో పాటు సొసైటీల వద్ద తగిన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎరువుల కొనుగోలుకు ప్రతి రైతు తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం ఒరిజినల్, జిరాక్స్, ఆధార్ జిరాక్స్ ధ్రువపత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పకుండా బిల్లులు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గరిష్ట ధర, సబ్సిడీ వివరాలు ఎరువుల బస్తాపై స్పష్టంగా రాస్తారు. వీటిని గమనించి రైతు తీసుకోవాల్సి ఉంటుంది.

మార్పిడి పద్ధతి పాటిస్తే మేలు



రైతులు ఎప్పుడూ ఒకే రకమైన పంటను సాగు చేయకుండా ఏటేటా పంట మార్పిడి విధానాన్ని అమలు పరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. భూసారానికి మేలు చేకూరుతుంది. మిశ్రమ పంటల సాగుతో నష్టాలు జరగకుండా నియంత్రించవచ్చు. ఒక పంట చేజారినా మరో పంట దిగుబడులతో లాభాలు గడించవచ్చు.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, చిత్రంలో ఎస్పీ జానకి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ అనుమతి లేని బీజీ-3 నకిలీ పత్తి విత్తనాల నియంత్రణకు కఠినచర్యలు తీసుకోవాలని, ఇందుకోసం పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకితో కలిసి నకిలీ విత్తనాల నియంత్రణపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి తర్వాత పత్తి పంటనే ఎక్కువ సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని బీజీ-3 పత్తి విత్తనాలు నిల్వ చేయడం, అమ్మడం, విత్తడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మడం నేరమన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. బీజీ-3 పత్తి విత్తనాల వలన భూసారం దెబ్బ తినడంతో పాటు వాతావరణం కలుషితం అవుతుందన్నారు. శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు 16 టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలోని 259 డీలర్ ఔట్‌లెట్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్‌శాఖ తరఫున నకిలీ పత్తి విత్తనాలు నియంత్రణ చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని, ఎలాంటి సమాచారం ఉన్నా ముందుగా తెలిపితే పోలీస్‌శాఖ నుంచి తగిన సిబ్బందిని పంపిస్తామన్నారు. జిల్లాలో ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీఏఓ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'మత్తు' వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి

డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర సూచించారు. కలెక్టరేట్‌లో డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం, రవాణాను యాంటీ డ్రగ్ కమిటీలు గుర్తించాలని సూచించారు. గంజాయి సాగు చేయకుండా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌శాఖ మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, పాన్‌షాప్‌లపై దృష్టి పెట్టాలన్నారు. మత్తు పదార్థాల బారిన పడిన ఎంతమంది వైద్యం కోసం ఆస్పత్రులకు వచ్చారని ఆరా తీశారు. పాఠశాలలు, కళాశాలలు, మెడికల్ కాలేజీలు, పబ్లిక్ ఉండే ప్రాంతంలో మత్తు పదార్థాలపై పోస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సీఎంఓ బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల జాడేది?



జూరాల ప్రధాన ఎడమ కాల్వ పరిధిలోని నందిమళ్ల శివారులో కాల్వ ఇలా..

- జూరాల ప్రధాన ఎడమకాల్వ వెంట సమస్యలు
- పెచ్చులూడిన లైనింగ్
- రెండేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- నిధుల మంజూరుకు ఎదురుచూపులు
- ముగుస్తున్న వేసవి.. వర్షాకాలంలో గండ్లు పడే ప్రమాదం

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ అధికారులు రెండేళ్లుగా సంబంధితశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నా.. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు గాకపోవడంతో మరుగునపడ్డాయి. ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ వెంట రంధ్రాలు పడటం, లైనింగ్ పెచ్చులూడటాన్ని గుర్తించిన అధికారులు మరమ్మతులకు ఎన్ని నిధులు అవసరం అన్న విషయాలను నివేదిస్తూనే ఉన్నారు. వర్షాకాలం రాకముందే మరమ్మతులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నా.. నిధులు ఎప్పుడు మంజూరవుతాయని ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జూరాల ప్రధాన జలాశయం నుంచి ఆత్మకూర్ శివారు వరకు ఎనిమిది చోట్ల కాల్వ దెబ్బతింది. ప్రాజెక్టు సమీపంలో ఉన్న వాటిని గుర్తించలేని అధికారులు వీపనగండ్ల వరకు ఉన్న ప్రధాన కాల్వ వెంట ఎన్ని సమస్యలు ఉన్నాయో ఎప్పుడు గుర్తిస్తారని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. రెండేళ్ల కిందట రూ.50 లక్షలతో డీ-6 కాల్వ మరమ్మతులకు అధికారులు సిద్ధమయ్యారు. వీటిని గతేడాది వేసవిలో పూర్తి చేయాలని నిర్ణయించినా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లి, కత్తేపల్లిలో రెండు ప్రధాన పనులు నిలిచిపోయాయి. వీటిని ఎప్పుడు పూర్తి చేస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఆయకట్టు ఇలా..
జూరాల జలాశయం ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టు మొత్తం 1.20 లక్షల ఎకరాలుగా నిర్ధారించినా.. ప్రస్తుతం 85 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించగలుగుతున్నారు. అమరచింత మండలం నుంచి ఆత్మకూర్, మదనాపురం, పెబ్బేరు, శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల మీదుగా 100 కిలోమీటర్ల పొడవునా కాల్వ విస్తరించి ఉంది. వీటిని ఆయా మండలాల్లో కొన్ని విభాగాలుగా గుర్తించి వాటి ప్రకారం రైతులకు సాగునీరు అందిస్తున్నారు. చివరి ఆయకట్టు వీపనగండ్లలోని గోపాల్‌దిన్నె రిజర్వాయర్ వరకు సాగునీటిని ఎడమకాల్వ వెంట విడుదల చేస్తుంటారు.

మరమ్మతు చేపట్టాలి..



జూరాల ప్రధాన ఎడమకాల్వ వెంట ఉన్న రంధ్రాలను పూడ్చటంతో పాటు లైనింగ్ దెబ్బతిన్న ప్రదేశాలను గుర్తించి మరమ్మతులకు నిధులు కేటాయించాలి. రెండేళ్లుగా కాల్వ వెంట మరమ్మతులు చేపట్టడం లేదు. కనీసం పూడికతీత, ముళ్లపొదల తొలగింపు వంటి పనులైనా పూర్తిచేయాలి.

– హన్మంతు, రైతు, నందిమళ్ల

ప్రతిపాదనలు పంపించాం..



ప్రధాన ఎడమ కాల్వ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు రెండేళ్లుగా ప్రతిపాదనలు పంపుతున్నాం. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధం చేసి అందజేశాం. నిధులు మంజూరు చేస్తే మరమ్మతులు చేపడతాం.

– జగన్మోహన్, ఈఈ, జూరాల జలాశయం

అస్తవ్యస్తంగా డీ-6 పిల్ల కాల్వలు..

జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న డీ-6 పిల్ల కాల్వల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. వారబందీ విధానంలో సాగునీరు అందిస్తుండటంతో ఆత్మకూర్ మండలంలోని కట్టకింది పల్లెల రైతులు తమ పొలాలకు సాగునీరు తీసుకెళ్లడానికి వీలుగా పిల్ల కాల్వల వెంట రంధ్రాలు వేయడం, బండరాళ్లు అడ్డు పెడుతుండటంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. వీటి మరమ్మతులు చేపట్టకుంటే సాగునీరు సీపేజ్ ద్వారా వృథాగా పారి ఆయకట్టుకు అందని పరిస్థితులు నెలకొననున్నాయి.

జూరాలకు 5,609 క్యూసెక్కుల వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద శుక్రవారం స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువన స్థానికంగా కురుస్తున్న వర్షాలతో రెండ్రోజులుగా ప్రాజెక్టుకు స్వల్పంగా వరద వస్తున్న విషయం తెలిసిందే. గురువారం 8,953 క్యూసెక్కుల వరద వస్తుండగా.. శుక్రవారం సాయంత్రానికి 5,609 క్యూసెక్కులకు తగ్గినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.657 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వివరించారు.

రేపు గ్రామ పాలన అధికారుల పరీక్ష

- రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిప్యూటీ నోడల్ ఆఫీసర్, లైజన్ ఆఫీసర్, సీనియర్ మెసెంజర్, చీఫ్ సూపరింటెండెంట్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులతో పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 25న (ఆదివారం) ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల జిల్లాకేంద్రంలోని చైతన్యహైస్కూల్ (బస్‌స్టాండ్ పక్కన)గ్రామ పాలన అధికారుల పరీక్ష ఉంటుందని, 152 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారని, ఉదయం 10 గంటల తర్వాత అభ్యర్థులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష ముగిసే వరకు బయటకు వెళ్లడానికి అనుమతి లేదని, అభ్యర్థులు ఇటీవల పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటో, పనిచేస్తున్న కార్యాలయ అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు. హాల్‌టికెట్‌పై ఉన్న ఫొటోపై సంబంధిత కార్యాలయ అధికారితో సంతకం చేయించుకోవాలన్నారు. పరీక్ష హాల్‌లోకి బాల్ పాయింట్ పెన్నులు (బ్లూ/బ్లాక్), హాల్‌టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు, ప్రధానంగా ఆధార్ మాత్రమే తీసుకెళ్లాలని, ఇతర రంగుల పెన్నులు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమని పేర్కొన్నారు. మే 25న కలెక్టరేట్‌లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు హెల్ప్ లైన్ నంబర్ 08542 241165 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ నవీన్, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణ పాల్గొన్నారు.

మళ్లీ రెవెన్యూ సదస్సులు

- జిల్లావ్యాప్తంగా ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు
- ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద పూర్తయిన మూసాపేట మండలం
- తప్పొప్పుల సవరణతోపాటు ఇతర సమస్యలపై అభ్యంతరాల నమోదు
- భూ భారతి చట్టం పకడ్బందీ అమలుపై అధికారుల కసరత్తు



భూ సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తున్న కొత్తచెర్వుతండా రైతులు (ఫైల్)

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గత తప్పిదాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. భూ ప్రక్షాళనలో భాగంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్, ధరణి చట్టం అమలు, తహసీల్దార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు, వెంటనే మ్యుటేషన్లు వంటి చర్యలు చేపట్టినా ఆశించిన ఫలితాలు రాకపోగా మరిన్ని భూ సమస్యలు పెరిగాయి. ధరణి అమలులో భూ రికార్డుల్లోని తప్పొప్పుల సవరణ, అభ్యంతరాల పరిశీలన వంటి అంశాలకు చోటు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తాయి. ధరణి తప్పిదాలను దృష్టిలో ఉంచుకొని భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చింది. ఈ చట్టానికి చట్టబద్ధత కల్పించిన అనంతరం నియమ, నిబంధనలు రూపొందించి.. చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒక్కో మండలం చొప్పున పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి భూ భారతి చట్టం అమలుపై దృష్టిసారించింది. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో మళ్లీ రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టం అమలు, సమస్యల పరిష్కారంపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని నిర్ణయించింది. కాగా ఇప్పటికే జిల్లాలోని మూసాపేట మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అక్కడ ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జూన్ 2 నుంచి అన్ని మండల కేంద్రాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

సవరణలకు ఆస్కారం
ఆర్‌ఓఆర్-2025 భూ భారతి చట్టం అమలులో కీలక అంశాలపై దృష్టి సారించనున్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తప్పొప్పుల సవరణ చేపట్టనున్నారు. భూమి ఉండి దానికి సంబంధించి రికార్డు లేకపోవడం, పట్టాదారు పాస్ బుక్ ఉన్నా భూమి లేకపోవడం, రికార్డుల్లో విస్తీర్ణాల తేడా, భూమి సంక్రమించిన విధానం, పట్టాదారు పేర్లలో తప్పులు వంటి దరఖాస్తులపై రెవెన్యూ సదస్సుల్లో పరిశీలన, వాస్తవికత ఆధారంగా సవరణ చేస్తారు. భూ ప్రక్షాళన సమయంలో పట్టాభూములు కోల్పోయిన రైతుల భూ సమస్యలను పరిశీలిస్తారు. గతంలో ఇలాంటి సవరణలకు ఆస్కారం ఉండేది కాదు. ధరణిలో తహసీల్దార్లకు ఎలాంటి అధికారాలు లేకపోగా.. ప్రస్తుత భూ భారతి చట్టంలో తహసీల్దార్లతోపాటు ఆర్డీఓలు, కలెక్టర్లకు అధికారాలు కల్పించనున్నారు.

రీ సర్వేకు చోటు
భూ భారతి చట్టంలో క్షేత్రస్థాయి కీలక సమస్యలకు పరిష్కారం లభించనుంది. ప్రధానంగా భూముల రీ సర్వే జరిగితే క్షేత్రస్థాయిలోనే ఎన్నో సమస్యలకు మార్గం సుగమవుతుంది. రికార్డుల ప్రక్షాళనతో పాటు భూ సర్వేకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కానున్నాయి. సర్వే నంబర్ల వారిగా హద్దుల గుర్తింపుతోపాటు సబ్ డివిజన్ సమస్యలకూ చెక్ పడనుంది.

పక్కాగా రిజిస్ట్రేషన్లు

భూభారతి చట్టం ప్రకారం భూముల క్రయవిక్రయాలు సలభతరంగా నిర్వహించేందుకు వీలు కల్పించనున్నారు. భూమి కొనుగోలు చేసిన వ్యక్తికి అమ్మకం దారు నుంచి సదరు భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే కచ్చితమైన హద్దులతోపాటు మ్యాపులు సమర్పిస్తేనే రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. రాబోయే రోజుల్లో భూములకు సంబంధించిన వివరాలన్నీ పక్కాగా ఉండేలా భూభారతి చట్టంతో పునాదులు పడనున్నాయని రెవెన్యూ వర్గాల పేర్కొంటున్నాయి.

సమూలమైన మార్పులు..



భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ శాఖలో సమూలమైన మార్పులు రానున్నాయి. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపేలా నిబంధనలను రూపొందించారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి చట్టం అమలుపై దృష్టిసారించడం జరుగుతుంది. క్రయ, విక్రయ లావాదేవీలను పక్కాగా చేపట్టేందుకు చట్టంలో మార్పులు రానున్నాయి.

– మోహన్‌రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


రామచంద్రయ్య (ఫైల్)

మద్దూరు: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మద్దూరులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం.. కోయిలకొండ మండలంలోని దమ్మాయిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రయ్య(42) కొన్నేళ్లుగా మద్దూరులో వెంకటేశ్వర డయాగ్నోస్టిక్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే కొంతకాలం క్రితం కోస్గిలో నూతనంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్ ఏర్పాటు చేశాడు. అయితే అక్కడ నష్టం రావడం, మద్దూరులో కూడా డయాగ్నోస్టిక్ సెంటర్ అంతంతగానే నడుస్తుండటంతో అప్పులు చేశాడు. తాను చేసినా అప్పులు ఎలా తీర్చాలో అని మనస్తాపం చెంది శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంట్లోని బెడ్‌రూంలోకి వెళ్లి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై రామచంద్రయ్య తమ్ముడు సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామచంద్రయ్యకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

- భార్యకు గాయాలు

రాజాపూర్: బంధువుల వివాహానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో తన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా, వెనక నుంచి లారీ ఢీకొట్టడంతో భర్త అక్కడికక్కడే మృతి చెందింది, భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాజాపూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మిడ్జిల్ మండలం మున్ననూర్ గ్రామానికి చెందిన కుర్వయాదయ్య(56), భార్య నారమ్మ, కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలు నవాబ్‌పేట మండలంలోని బంధువుల వివాహకార్యక్రమంలో పాల్గొని హైదరాబాద్‌కు బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. రాజాపూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వెళ్తుండగా బైక్‌ను వెనకనుంచి లారీ ఢీకొట్టింది. దీంతో యాదయ్య కుడివైపు కింపడటంతో అతని మీద నుంచి లారీ టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నారమ్మ ఎడమవైపుకు పడటంతో గాయాలతో బయటపడింది. తన కళ్లముందు కట్టుకున్న భర్త దుర్మరణం చెందడంతో ఆమె రోదనలు అక్కడున్న వారిని కలిచివేశాయి. విషయం తెలిసి వెంటనే రాజాపూర్ ఎస్ఐ శివానందంగౌడ్ అక్కడికి చేరుకున్నారు. నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మతిస్థిమితం సరిగా లేక మహిళ ఆత్మహత్య

మానవపాడు: మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మానవపాడులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ అంజనేయులు కథనం ప్రకారం.. మానవపాడుకు చెందిన బోయ సుజాత(45), రాముడు దంపతులు వ్యవసా య పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మద్యానికి బానిసైన సుజాత మానసిక స్థితి కోల్పోయింది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై శుక్రవారం పెద్ద కూతురు పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. సుజాతకు భర్తతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్: మద్యం మత్తులో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని బోయిన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు కథనం మేరకు.. గ్రామానికి చెందిన కేశ యాదయ్య (52) కొంతకాలంగా మద్యానికి బానిసై పొలం పనులు పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆలయ సమీపంలో ఉన్నాడని గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు కేశ మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

చెరువులో పడి మహిళ మృతి


హన్వాడ: మండలంలోని అమ్మాపూర్ గ్రామశివారులోని చెరువులో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని మునిమోక్షం గ్రామానికి చెందిన బుడ్డభాగ్యమ్మ అమ్మాపూర్ శివారులో ఉన్న చెరువు దగ్గరకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లింది. ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఆమె కుమారుడు బుడ్డ కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైవే నిర్మాణం.. వివాదం


కనుమరుగు కానున్న అంబేడ్కర్ సర్కిల్

- ఆది నుంచి వివాదాలకు నెలవుగా మారిన ఎన్‌హెచ్–167 పనులు
- జడ్చర్లలో కనుమరుగుకానున్న అంబేడ్కర్ సర్కిల్
- సర్వీస్‌రోడ్డు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకే పరిమితం
- భారీ వాహనాలు రాకపోకలు సాగించేది ఎలా?
- వ్యతిరేకిస్తూ నేడు పాతబజార్‌వాసుల అఖిలపక్ష సమావేశం

జడ్చర్ల టౌన్: జాతీయ రహదారి–167 నిర్మాణ పనులు ఏ ముహూర్తాన ప్రారంభించారోగాని వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. పట్టణంలో మొదట ఫ్లై ఓవర్ వంతెన మంజూరు కాగా స్థానికుల ఆందోళనలతో నాలుగు వరసల రహదారిగా మార్చారు. ఇందులోనూ ప్రస్తుతం మరో వివాదం మొదలైంది. విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న అంబేడ్కర్ చౌరస్తా పూర్తిగా కనుమరుగుకానుంది.


రహదారి నిర్మాణ చిత్రం

పాతబజార్‌కు వెళ్లాలంటే రైల్వే వంతెన దాటి కల్వకుర్తి రోడ్‌లో యూటర్న్ తీసుకుని వెళ్లాల్సిందే. ఈ విషయాన్ని స్వయంగా జాతీయ రహదారులశాఖ డీఈ సుమిత్‌కుమార్ వెల్లడించడంతో పాతబజార్ వాసుల్లో ఆందోళన మొదలైంది. పాతబజార్‌కు వెళ్లేందుకు సర్వీస్‌రోడ్డు నిర్మాణం చేస్తున్నప్పటికీ కేవలం కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు మాత్రమే పరిమితం కావడంతో ఆందోళన బాట పట్టనున్నారు. ఇందుకోసం శనివారం గౌడ ఫంక్షన్‌హాల్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. నెహ్రూ చౌరస్తాలో 100 మీటర్ల అతి పెద్ద సర్కిల్ నిర్మాణం చేపడుతున్న జాతీయ రహదారులశాఖ అంబేడ్కర్ సర్కిల్‌ను తొలగించడంపై స్థానికుల్లోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

చర్చించి నిర్ణయం తీసుకుంటాం..



అంబేడ్కర్ సర్కిల్‌ను తొలగించి పాతబజార్‌కు భారీ వాహనాల రాకపోకలు లేకుండా చేస్తున్న అంశంపై అఖిలపక్ష సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. అందుకే శనివారం సమావేశం నిర్వహిస్తున్నాం. సర్వీస్‌రోడ్డు నిర్మించినా అది కేవలం కార్లు, ఆటోలకే పరిమితం కావడం సరికాదు. ఇపుడున్నట్లుగానే పాతబజార్‌కు వాహనాల రాకపోకలు సాగించేలా ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తాం. అధికారుల తప్పిదంతో 20 వేల మంది ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. – పి.మురళి, పాతబజార్

డిజైన్ మార్చాల్సిందే..



జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పాతబజార్‌కు వాహనాలు వెళ్లకుండా చేయడం సరికాదు. ప్లానింగ్ సరిగా ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డిజైన్ మార్చేలా చూస్తాం. రోడ్డు విస్తరణ జరగాల్సిందే కాని అందరికి అనుకూలంగా ఉండాలి. ఇప్పుడున్నట్లుగానే యధావిధిగా వాహనాలు పాతబజార్‌కు వెళ్లేలా చూడాల్సిందే. ఇందుకోసం అఖిలపక్షం వేస్తే పాతబజార్ వాసులందరు సహకరించాలి.

– వంశీచారి, పాతబజార్

భారీ వాహనాలు వెళ్లేదెలా?

ముఖ్యంగా స్టేషన్ రోడ్డు, ఆర్‌యూబీ ద్వారా భారీ వాహనాలు వెళ్లే ఆస్కారం లేకుండా పోయింది. పాతబజార్, ఆలూరు, బూరెడ్డిపల్లి వైపు భారీ వాహనాలు అంటే బస్సులు, లారీలు, ఇతర వాహనాలు వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. కర్వెన రిజర్వాయర్ పూర్తయి టూరిజం అభివృద్ధి చెందితే ఇదే మార్గంలో ఆలూరు మీదుగా వాహనాలు చేరుకోవాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రోడ్డుపై రాకపోకలు నిలిపివేయడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఇప్పటికే పాతబస్టాండ్‌కు బస్సుల రాకపోకలు నిలిచిపోగా.. పూర్వ వైభవం తెచ్చేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. భారీ వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా చేయడం సరికాదని పాతబజార్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాల పట్టివేత

- వ్యవసాయ శాఖ, పోలీసుల దాడులు
- గోప్లాపూర్‌లో గుట్టుగా పత్తి విత్తనాల నిల్వలు
- నిందితుడిపై కేసు నమోదు


నకిలీ బీజీ–3 పత్తి విత్తనాలు, నిందితుడితో డీఏఓ వెంకటేశ్ తదితరులు

జడ్చర్ల: ప్రభుత్వం నిషేధించిన బీజీ–3 పత్తి విత్తనాలను జిల్లా వ్యవసాయ శాఖ, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్, సీఐ కమలాకర్‌లు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని గోప్లాపూర్‌లో గుట్టుగా లూజ్ పత్తి విత్తనాలను గుంటూరు, మాచర్ల ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని రైతులకు విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా అధికారులకు విషయాన్ని చేరవేశారు. దీంతో వ్యవసాయ శాఖ జడ్చర్ల పోలీసులను అప్రమత్తం చేశారు. శుక్రవారం ఉదయాన్నే వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా 8 టాస్క్‌ఫోర్స్ బృందాలు గోప్లాపూర్ గ్రామానికి చేరుకుని అనుమానం ఉన్న పలువురు రైతుల ఇళ్లను ఏకకాలంలో సోదా చేశారు. తనిఖీలో రైతు మధుసూదన్‌రెడ్డి దగ్గర ప్లాస్టిక్ కవర్లలో కిలో చొప్పున ప్యాక్ చేసిన లూజ్ బీజీ–3 పత్తి విత్తనాలు దొరికాయి. మొత్తం 30 ప్యాకెట్లను రైతు నుంచి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకుని జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాలను ప్రాథమికంగా పరీక్షలు నిర్వహించగా బీజీ–3 విత్తనాలుగా నిర్ధారించారు. అయితే ఆయా విత్తనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించి పరీక్షిస్తామని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే నకిలీ విత్తనాలను అంటగట్టే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో నకిలీ విత్తనాల కేసులలో ఉన్న నిందితులను కూడా బైండోవర్ చేస్తామన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీ చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ లైసెన్స్‌లు ఉన్న దుకాణాలలోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కోరారు. పంట నష్టం జరిగిన సమయంలో పంటల బీమా, తదితర పరిహారం కోసం బిల్లులు ఉపయోగపడుతాయన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తమ సిబ్బంది రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుకు రెండో విజయం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

గద్వాలపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్ అండర్–23లో పాలమూరు జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. జిల్లాకేంద్రం సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో శుక్రవారం గద్వాల జట్టుతో జరిగిన మ్యాచ్‌లో పాలమూరు జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గద్వాల జట్టు పాలమూరు బౌలర్ల ధాటికి 25.2 ఓవర్లలో కేవలం 104 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులో రాహుల్ యాదవ్ 53 పరుగులు చేశాడు. పాలమూరు బౌలర్ ఎండీ ముఖీతుద్దీన్ 7 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. మరో బౌలర్ కొండ శ్రీకాంత్ 9.2 ఓవర్లలో 38 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు జట్టు 21 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేసింది. జట్టులో డేవిడ్ క్రిపాల్ 44, మహ్మద్ షాదాబ్ 22 పరుగులు చేశారు.

జిల్లాకు పేరు, ప్రతిష్టలు తేవాలి

క్రికెట్‌లో క్రీడాకారులు ప్రతిభచాటి జిల్లాకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. అండర్–23 లీగ్ మ్యాచ్ సందర్భంగా ఆయన మహబూబ్‌నగర్, గద్వాల జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి అసోసియేషన్ ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎంతోమంది జిల్లా క్రీడాకారులు క్రికెట్‌లో రాణిస్తుండడం అభినందనీయమన్నారు. అండర్–23 లీగ్‌లో ప్రతిభచాటాలని కోరారు. భవిష్యత్‌లో జిల్లా క్రీడాకారులు రంజీ, భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, వెంకటరామారావు, సీనియర్ క్రీడాకారులు ముఖ్తార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్యకేసులో నిందితుడు అరెస్టు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కనకయ్యగౌడ్

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం మత్తులో మహిళపై లైంగిక దాడి చేసి హత్యచేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కనకయ్య గౌడ్ తెలిపారు. ఫిబ్రవరి 12న జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి వెనుక గేటు వద్ద జరిగిన హత్యకేసుకు సంబంధించి సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కావలి శాంతమ్మ యాచకురాలిగా జీవనం సాగిస్తోంది. ఈమె ఫిబ్రవరి 12న జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి వెనుక గేటు వద్ద హత్యకు గురైంది. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా హత్య సంఘటనా స్థలంలో సీసీ కెమెరాల ద్వారా ఆధారాలు సేకరించారు. హత్యకు పాల్పడిన వ్యక్తి చెత్తకాగితాలు ఏరుకుని జీవనం సాగించే తాడూరు మండలం పాపగల్ గ్రామానికి చెందిన గోవింద్‌రాములుగా గుర్తించారు. నిందితుడి కోసం మూడునెలలుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం నిందితుడు తిమ్మాజీపేట మండలం నేరేళ్లపల్లి గ్రామానికి వచ్చాడనే సమాచారంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా మద్యం మత్తులో మహిళపై లైంగికదాడి చేసి హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడి భార్య పదేళ్ల క్రితమే అతడికి దూరంగా ఉండటంతో మహిళలపై కోపం పెంచుకుని సైకోగా ప్రవర్తించే వాడని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ గోవర్ధన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

శ్రీశైలానికి వరద ప్రవాహం

దోమలపెంట/ రాజోళి: ఎగువ ప్రాంతం సుంకేసుల నుంచి శ్రీశైలం జలాశయానికి శుక్రవారం 15,602 క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చి చేరింది. ప్రస్తుతం జలాశయంలో 817.7 అడుగుల వద్ద 39.1450 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇదిలా ఉండగా గత 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే సుంకేసుల డ్యాంకు శుక్రవారం 2,215 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును 0.5 మేర తెరిచి అదే స్థాయిలో దిగువకు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. అలాగే కేసీ కెనాల్‌కు 159 క్యూసెక్కులను వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం వద్ద పౌరసరఫరాలశాఖ డీఎం, అధికారులు

నారాయణపేట: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాలశాఖ డీఎం సైదులు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులతో కలిసి ఇంటిపై దాడి చేసి పట్టుకున్నట్లు డీఎం వివరించారు.

ముగిసిన షా అలీ పహిల్వాన్ ఉర్సు

నాలుగో రోజు మహిళలకు ప్రత్యేకం


దుకాణాల వద్ద మహిళల కొనుగోళ్ల సందడి

అలంపూర్: పట్టణంలోని హజ్రత్ షా అలీ పహిల్వాన్ ఉర్సు శుక్రవారం ముగిసింది. చివరి రోజు మహిళల ఉర్సుతో ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ నెల 20న గంధంతో ఉర్సు ప్రారంభం కాగా.. 21న సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తీ పోటీలు, 22న దడ్ ముబారక్ దర్గాలో పెద్ద కిస్తీలు నిర్వహించారు. ఉర్సులో పెద్ద కిస్తీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. భక్తులు కిస్తీలకు ప్రసాదం అందించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా హాజరై కిస్తీ పోటీలను తిలకించారు. ఉర్సు చివరిరోజు గాజులు, బొమ్మల దుకాణాల వద్ద మహిళల రద్దీ కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైల్వేస్టేషన్‌కు నల్లా బిల్లు రూ.5.30 లక్షలు!

- తొమ్మిదేళ్ల తర్వాత డిమాండ్ నోటీసు అందజేత


మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు పుర కమిషనర్ జారీ చేసిన డిమాండ్ నోటీసు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఏడాదికోసారి (12 నెలలు కలిపి) నల్లా బిల్లు వసూలు చేయాల్సిన మున్సిపల్ అధికారులు ఏకంగా తొమ్మిదేళ్ల తర్వాత డిమాండ్ నోటీసులిచ్చారు. మహబూబ్‌నగర్‌లోని రైల్వేస్టేషన్ (దక్షిణ మధ్య రైల్వే డివిజన్)కు దశాబ్దాల క్రితమే మున్సిపల్ అధికారులు నల్లా కనెక్షన్ ఇచ్చారు. అక్కడి కార్యాలయంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఆ మేరకు ఒకచోట ట్యాంకుతో పాటు మీటరు సైతం బిగించి, 10 కిలో వాటర్‌కు గాను రూ.130 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని రైల్వే అధికారులకు సూచించారు. ఇందుకుగాను 2016 వరకు ఏటా బిల్లు వసూలు చేశారు. ఇదే సంవత్సరంలో అప్పటి మున్సిపాలిటీ సీనియర్ అసిస్టెంట్ మిరాజ్ అలీ అనారోగ్యంతో మృతి చెందారు. ఆ తర్వాత అక్కడికి వెళ్లి మీటరు రీడింగ్ తీసి, బిల్లు వసూలు చేయడం మరిచిపోయారు. ఈ విషయం ఇటీవల ప్రస్తుత ఇంజినీరింగ్ విభాగం (నీటి పన్ను) సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య దృష్టికి వచ్చింది. దీంతో ఆయన మూడు రోజుల క్రితమే రైల్వేస్టేషన్‌కు వెళ్లి తొమ్మిదేళ్ల రీడింగ్‌తో పాటు ఎంత మొత్తం రావాలో లెక్కగట్టారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డికి నివేదించారు. అయన ఆదేశాల మేరకు రూ.5,30,023కు డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఈ విషయమై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అప్పట్లో నల్లా పన్నుల విభాగాన్ని ఉద్యోగి మిరాజ్ అలీ చూసేవారన్నారు. తొమ్మిదేళ్ల క్రితం ఆయన ఆకస్మిక మృతితో నల్లా కనెక్షన్లకు సంబంధించి కొన్ని ఫైళ్లు అందుబాటులో లేకుండా పోయాయి. ఇటీవల క్షేత్రస్థాయిలో అన్ని కనెక్షన్లను పరిశీలించి ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయిస్తున్నామన్నారు. ఈ తనిఖీలలో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ నల్లా బిల్లు పెండింగ్‌లో ఉన్న విషయం బయట పడిందన్నారు. దీంతో ప్రస్తుతం మరోసారి మొత్తం బిల్లు చెల్లించాలని డిమాండ్ నోటీసు అందజేశామన్నారు. కాగా.. ఈ నెలాఖరు వరకు బిల్లు చెల్లిస్తామని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


బోయ శివకుమార్ (ఫైల్)

ఎర్రవల్లి: చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామానికి చెందిన బోయ శివకుమార్ (21)ను బాగా చదువుకోవాలని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా శాంతినగర్‌కు వెళ్లి మద్యం సీసాలో గడ్డిమందు కలుపుకొని తాగి తిరిగి ఇంటికొచ్చి పడుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. చేతికొచ్చిన కుమారుడు కళ్లముందే విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

భూ సేకరణను అడ్డుకున్న రైతులు



మక్తల్: నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ సర్వేను మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లి గ్రామ శివారు రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ భూముల్లో సర్వే నిర్వహించేందుకు ఒప్పుకోమని రెవెన్యూ అధికారులకు తేల్చి చెప్పారు. అయితే పోలీసుల బందోబస్తు మధ్య సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించారు. దీంతో సర్వే అధికారులను అడుగడుగునా రైతులు అడ్డుపడటంతో చేసేదేమీలేక వెనుదిరిగారు.

ఆటోను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

- ఆరుగురికి గాయాలు

వెల్దండ: మండలంలోని చెర్కూర్ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని కారు ఆటోని ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. గురువారం రాత్రి చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన చవ్వ మల్లేష్, మంజుల దంపతులు నలుగురు పిల్లలతో కలిసి తమ ఆటోలో కల్వకుర్తికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. మార్గ మధ్యలో చెర్కూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్లేష్ కాళ్లకు గాయాలయ్యాయి. మంజులకు రెండు కాళ్లు విరగడంతో పాటు నడుముకు, తలకు గాయలయ్యాయి. నలుగురు పిల్లలు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. స్థానికులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.